క్లుప్తంగా

సామూహిక సీమంతాలు



సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: రోటరీ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. రోటరీ ప్రెసిడెంట్ పెనుమర్తి సురేష్‌బాబు, సెక్రటరీ సంధ్య ప్రవల్లికల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 80 మంది గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. వారికి చీరలు, గాజులు, పండ్లు, పుసుపు, కుంకుమ, ప్రొటీన్ పౌడర్, పౌష్టికాహారం అందజేశారు.

పాఠశాల బస్సుల తనిఖీ

జంగారెడ్డిగూడెం: పాఠశాలలు, కళాశాలల బస్సులు ప్రతిరోజూ తనిఖీలు నిర్వహించనున్నట్టు ఆర్టీఓ (ఎఫ్ఏసీ), ఎంవీఐ ఎస్ఎస్ రంగ నాయకులు అన్నారు. జంగారెడ్డిగూడెంలో బుధవారం పాఠశాలల, కళాశాలల బస్సులను ఆయన ఏఎంవీఐలు సీహెచ్ సత్యనారాయణ, కేడీవీ రవిగోపాల్‌తో కలిసి తనిఖీ చేశారు.

అధ్యాపకుల సమస్యలపై వినతి

జంగారెడ్డిగూడెం: టీచర్‌లు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌ను ప్రభుత్వ కళాశాల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. బుధవారం ఎమ్మెల్యేను వారు కలిసి వినతి పత్రం అందజేశారు. కళాశాల విద్యాశాఖలో అధ్యాపకుల సాధారణ బదిలీలకు అనుమతి ఇవ్వాలని, ఎయిడెడ్ అధ్యాపకులకు ప్రభుత్వ కళాశాలలో విలీనానికి సంబంధించి ఇచ్చిన జీఓ 42పై సత్వరం చర్యలు తీసుకోవాలని కోరారు. అధ్యాపకుల రీడిజిగ్నేషన్ ఉత్తర్వులు ఇవ్వాలని, అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి ఈనెల 18న విజయవాడలో ధర్నా చేస్తున్నట్టు తెలిపారు..

18 నుంచి శ్రీనివాసుని పవిత్రోత్సవాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఉపాలయమైన లక్ష్మీపురం శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఈనెల 18 నుంచి శ్రీనివాసుని దివ్య పవిత్రోత్సవాలు సర్వదోషోపసమనం నిమిత్తం ఈనెల 21 వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. 18న అర్చకులు విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణతో ఉత్సవాలకు శ్రీకారం చుడతారని పేర్కొన్నారు. 19న పవిత్రాధివాసం, 20న స్నపన, పవిత్రారోహణ, మహాశాంతి హోమం, ఉత్సవాల ఆఖరి రోజైన 21న పవిత్రావరోహణ, మహా పూర్ణాహుతి ఉంటుందని వివరించారు. భక్తులంతా పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం: స్థానిక సుబ్బారెడ్డి కాలనీ లైన్‌పై మున్సిపాలిటీ మంచినీటి నూతన బోరు లైన్, ట్రాన్స్‌ఫార్మర్ బిగించే పనుల నిమిత్తం గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. అశ్వారావుపేట రోడ్డు, సుబ్బారెడ్డి కాలనీ, లక్ష్మీ ఆసుపత్రి ఏరియా, పోలీస్ స్టేషన్ ఏరియాల్లోని అన్ని రకాల సర్వీసులకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పేదలకు సాగు హక్కు కల్పించాలి

జంగారెడ్డిగూడెం: ఎర్రకాలువ ప్రాజెక్టు మిగులు భూముల్లో ఎ.పోలవరం, చిన్నవారిగూడెం పేదలకు సాగు హక్కు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఎ.పోలవరం సచివాలయం వద్ద సంఘ మండల అధ్యక్షురాలు యాగంటి సీత అధ్యక్షతన ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సచివాలయం రెవెన్యూ సిబ్బందికి అందించారు. జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు బొక్క వెంకటేష్, కలపాల వెంకయ్య, యడ్లపల్లి దుర్గారావు, కె.శేషారావు తదితరులు పాల్గొన్నారు.

మెండుగా ఆదాయం

జంగారెడ్డిగూడెం: స్థానిక శ్రీ సీతారామస్వామి దేవస్థానానికి గణనీయమైన ఆదాయం లభించింది. ఈ దేవస్థానం భూమి 32.40 ఎకరాలను రెండు భాగాలుగా విభజించి బుధవారం అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలాన్ని జంగారెడ్డిగూడెంకు చెందిన పేరిచర్ల జగపతిరాజు దక్కించుకున్నారని, మొదటి ప్రతి 28.86 ఎకరాలకు ఏడాదికి ఎకరానికి రూ.52 వేలు చొప్పున రూ.15,00,720, రెండో ప్రతి 3.54 ఎకరాలకు ఏడాదికి ఎకారనికి రూ. 69 వేలు చొప్పున రూ.2,44,260 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ కలగర శ్రీనివాస్ తెలిపారు. ఈ వేలం ప్రక్రియ 3 సంవత్సరాల పాటు చెల్లుబాటులో ఉంటుందన్నారు.

పింఛన్లు ఇవ్వాలని ధర్నా

బుట్టాయగూడెం: అర్హులైన వారికి పింఛన్లు ఇవ్వాలని కోరుతూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ ఏఓ బేబీ సరోజినికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు అందుగుల ఫ్రాన్సిస్, తలారి కొండయ్య, దొండపాటి వెంకటేశ్వరరావు, బేతాళ డేవిడ్, బంటుమిల్లి కృపారావు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుపై ఆసక్తి

- మన్యంలో పెరుగుతున్న ప్రకృతి సేద్య విస్తీర్ణం
- 16 వేల ఎకరాలకు పైగా సాగు



తూర్పురేగులకుంటలో సేంద్రియ పద్ధతిలో పండిస్తున్న మినుము, రాగి పంటలు

బుట్టాయగూడెం: రసాయనాలతో పండించిన పంటలతో అనారోగ్యాలు వస్తుడడంతో ప్రజల ఆహారపు అలవాట్లలో కూడా మార్పు వస్తోంది. పర్యవసానంగా సేంద్రియ ఆహార పదార్థాలపై ప్రస్తుతం ప్రజలు ఎక్కువ దృష్టి సారిస్తున్నారు. మార్కెట్‌లో వీటికి డిమాండ్ పెరగడంతో రైతులు సైతం సేంద్రియ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. పోలవరం నియోజకవర్గం బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, కొయ్యలగూడెం మండలాల పరిధిలో రైతులు ప్రకృతి సాగు వైపు మళ్లుతున్నారు. ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను ప్రజలకు అందించడానికి, భూసారాన్ని పరిరక్షించడానికి ప్రకృతి వ్యవసాయం ఉపయోగకరంగా ఉండడంతో సాగు విస్తీర్ణం ప్రతి ఏటా పెరుగుతోంది. ప్రకృతి సేద్యం వల్ల ఖర్చులు తక్కువ, దిగుబడులు అధికంగా పెరగడంతో రైతులు ప్రకృతి వ్యవసాయ సాగు చేపడుతున్నారు.

సత్తువ కోసం నవధాన్యాల సాగు

కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలో ఉన్న బుట్టాయగూడె, జీలుగుమిల్లి, పోలవరం మండలాలతో పాటు జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాల్లో సుమారు 16 వేల ఎకరాల్లో సుమారు 12592 మంది రైతులు ప్రకృతిసాగు చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. రైతులు పంటలకు ముందు 30 రకాల విత్తనాలతో భూముల్లో పోషకాల లభ్యత (సత్తువ కోసం) నవధాన్యాల సాగు చేపడుతున్నారు. అనంతరం ప్రకృతిసాగులో భాగంగా వరి, మొక్కజొన్న, చిరుధాన్యాలు, రాగులు, కొర్రలు, సామలు, జొన్నలు, సజ్జలు, పప్పుధాన్యాలు, మినుము, పెసర, బొబ్బర్లు వంటి పంటలను పండిస్తున్నారు. ఏడాది అత్యధికంగా ఆయా పంటలను వేసినట్టు అధికారులు చెబుతున్నారు.

సహజ ఎరువుల వినియోగం

సేంద్రియ విధానంలో పంటల సాగుకు ప్రకృతిసిద్ధంగా లభించే పదార్థాలు, ద్రవాలతో తయారు చేసి ఎరువులు, క్రిమి సంహారక కషాయాలను వినియోగిస్తున్నారు. రసాయనిక ఎరువుల కంటే ఇవి తక్కువ ధరలకు లభించడంతో రైతులు ప్రకృతి కషాయాలపై దృష్టి పెట్టారు. పూతపై పురుగుల నివారణకు, పూత నిలబడడానికి మజ్జిగ, ఇంగువ, బెల్లం మిశ్రమ ద్రవణాన్ని, ఎరువుగా వాడటానికి ఆవుపేడ, బెల్లం, పప్పుదినుసుల పిండి, తగినంత గోమూత్రాన్ని కలిపి మిశ్రమంగా తయారు చేసిన ఉండలను వాడుతున్నారు. వీటికి నీటిని కలిపి తయారు చేసిన ద్రవ, జీవామృతాన్ని పంటలపై చీడ, పీడల నివారణకు, పంటలు బలంగా దిగుబడి ఇచ్చేందుకు వినియోగిస్తున్నారు.

సేంద్రియ ఉత్పత్తులకు గిరాకీ



కేఆర్‌పురం ఐటీడీఏ డివిజన్ పరిధిలో సుమారు 16 వేల ఎకరాల్లో రైతులు ప్రకృతి సాగు చేస్తున్నారు. ఇటీవల ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మంచి గిరాకీ ఏర్పడింది. కళ్లాల్లోనే ఘన, జీవామృతం తయారీలపై శిక్షణ ఇస్తున్నాం. తక్కువ ఖర్చుతో మంచి దిగుబడి రావడంతో రైతులను ప్రోత్సహిస్తున్నాం.

– హుస్సేన్, ప్రకృతి వ్యవసాయ ఎస్ఎఫ్ఏ, కేఆర్‌పురం

భూములు సారవంతం



ప్రకృతి వ్యవసాయంలో సాంప్రదాయ ఘన, ద్రవ, జీవామృతాలే ఎరువులుగా ఉపయోగించడం వల్ల లభించే ఉత్పత్తులు ఆరోగ్యకరమైనవిగా ఉంటాయి. ఈ సాగులో భూములు కూడా సారవంతమవుతాయి. తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన కూరగాయలు, పంటలను కూడా సాగు చేయవచ్చు.

– ఎస్ శ్రీను, ప్రకృతి వ్యవసాయ సీఆర్‌పీ, కేఆర్‌పురం

రైతులకు స్ప్రేయర్ల పంపిణీ



రైతులకు స్ప్రేయర్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: జీడి మామిడి రైతులకు లబ్ధి చేకూరే విధంగా స్ప్రేయర్లను ఉచితంగా పంపిణీ చేసినట్లు ఉద్యాన శాఖ అధికారి పి.ధీరజ్ లక్ష్మణ్ బుధవారం పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెం రోటరీ క్లబ్ కళ్యాణ మండపంలో జీడి మామిడి యాజమాన్య పద్ధతులు కొమ్మకత్తిరింపులు సస్యరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించామని తెలిపారు. జీడి మామిడి పరిశోధన స్థానం బాపట్ల ప్రధాన శాస్త్రవేత్త ఎం ఉమామహేశ్వరరావు, కీటక శాస్త్రం శాస్త్రవేత్త జి.స్రవంతి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ ఏలూరు జిల్లాకు కె.సంతోష్ హాజరై రైతులకు జీడిమామిడిలోని సస్యరక్షణ చర్యలు, ఉత్పాదక సామర్థ్యం పెంపుదలపై అవగాహన కల్పించారని వివరించారు. కొయ్యలగూడెం బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి జీడిమామిడి సాగు చేస్తున్న రైతులు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. అనంతరం ఒక్కొక్కటీ రూ.10 వేలు విలువైన 10 స్ప్రేయర్లను మండలానికి చెందిన జీడిమామిడి రైతులకు అందజేశారని పేర్కొన్నారు.

‘కూటమి’ మోసాలను ఎండగట్టడమే లక్ష్యం

వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి విజయరాజు



బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న విజయరాజు, నాయకులు

లింగపాలెం : కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగట్టడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు అన్నారు. లింగపాలెం మండలం ముడిచెర్ల గ్రామంలో బుధవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడుస్తున్నారని తెలిపారు. ఉచిత గ్యాస్, తల్లికి వందనం పథకాల్లోనూ ప్రజలకు మోసమే జరిగిందని వివరించారు. పథకాల అమలుపై ప్రజలు అడుగుతారేమోనన్న భయంతో డైవర్షన్ పాలిటిక్స్ మొదలెట్టేశారని మండిపడ్డారు. ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు, అభిమానులపై దాడులు చేయడం, వారిని అక్రమంగా అరెస్ట్ చేయడం తప్ప రాష్ట్రంలో మంచి పాలన చేయడం లేదని ధ్వజమెత్తారు. మ్యానిఫెస్టోకి హామీ ఇచ్చిన పవన్‌కళ్యాణ్ ఇప్పుడు మౌనవ్రతం చేయడం సిగ్గుచేటన్నారు. పథకాల్ని అమలు చేస్తే రాష్ట్రాన్ని అమ్మివేయాలంటూ వ్యవసాయశాఖ మంత్రి అచ్చంనాయుడు అనటం మోసానికి ఒక కారణం అని తెలిపారు. ఉచిత బస్సు పేరుతో మహిళలను మోసం చేశారని ఆరోపించారు.

నాడు ఏడాదిలోపే హామీల అమలు

వైఎస్సార్‌సీపీ హయాంలో ఏడాదిలోపే ఎన్నికల హామీలన్నీ అమలు చేశామని గుర్తుచేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేశారని వివరించారు. అనంతరం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం క్యూఆర్ కోడ్‌కలిగిన బ్రోచర్ల విడుదల చేశారు. ఈ క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్‌ఫోన్లలో స్కాన్‌చేస్తే కూటమి మోసాలు బట్టబయలవుతాయని విజయరాజు వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు అన్నపనేని శాంతారావు, నాయకులు రావి కొండయ్య, నత్తా ఆనంద్, ములగలంపాడు సర్పంచ్ ఇనుగంటి రాజేష్‌బాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు రెడ్డిన శ్రీను, పార్టీ యూత్ మండల అధ్యక్షులు చీదరాల ప్రసాద్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు అరిగిల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ముడిచెర్ల అధ్యక్షుడిగా రత్తయ్య

వైఎస్సార్ సీపీ ముడిచెర్ల గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పరసా రత్తయ్య ఏకాగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఎంపీటీసీ ముళ్లంగి ప్రభాకరెడ్డి ఇంటి ఆవరణలో నిర్వహించిన సమావేశంలో పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఆ వివరాలను పార్టీ మండల అధ్యక్షులు అన్నపనేని శాంతారావు ప్రకటించారు. ప్రధాన కార్యదర్శులుగా ములంగి ప్రమీలారాణి, బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, మరుగుల రమేష్, బుల్లా శాంతి, కార్యదర్శులుగా గుళ్లపూడి నాగరాజు, డోల లక్ష్మి, వినన్నపల్లి రాజు, డోలా పుష్ప ఎన్నికయ్యారు. పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది. కార్యక్రమంలో నాయకులు గుళ్లపూడి ప్రసాద్, బాల లోకేశరావు తదితరులు పాల్గొన్నారు.

చుండూరు మృత వీరులకు జోహార్లు



చుండూరు మృతవీరులకు జోహార్లర్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: సాంఘిక, సాంస్కృతిక పునాదిలేని రాజకీయ విప్లవం, స్వాతంత్ర్యం అత్యధిక కాలం మనుగడ సాధించలేవని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పిన రాజనీతి తత్వాన్ని ప్రతి ఒక్కరు గుర్తు చేసుకోవాలని ప్రముఖ విద్యావేత్త అలుగు ఆనందశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద చుండూరు మృత వీరుల సంస్మరణ సభ నిర్వహించారు. బొగ్గవరపు బాబూరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చుండూరు మృత వీరులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు జొన్నకూటి వెంకటేశ్వరరావు, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి కలపాల రాజకుమార్, బ్యాటరీ నాగు, గుండె నారాయణ,పిల్లి సుబ్బారావు, ఘంటా రామారావు, అలుగు విజయానంద శేఖర్, వసంతాడ సువర్ణ రాజు, మొల్ల తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇన్సూరెన్స్ తప్పనిసరి

చింతలపూడి : రైతులు తప్పని సరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని చింతలపూడి వ్యవసాయ సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ వై.సుబ్బారావు సూచించారు. మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కౌలు కార్డులు, పంట నమోదు, డ్రోన్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్ విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యానాధికారి అఫ్రీన్, సీఐ క్రాంతి కుమార్, ఏఓ మురళి పాల్గొన్నారు.

ధర్మాజీగూడెంలో..

లింగపాలెం: మండలంలోని ములగలంపాడు, ధర్మాజీగూడెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ బి.ప్రదీప్‌కుమార్ రైతు పంట బీమాపై అవగాహన కల్పించారు. గారపాటి నాగ వరప్రసాద్, నిమ్మగడ్డ సుధాకర్ పాల్గొన్నారు.

పరింపూడి, రాజవరంలో..

కొయ్యలగూడెం: పరింపూడి, రాజవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. నానో యూరియా, డీఏపీల వినియోగంపై ఏవో పోసారావు ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి రైతు ఈ పంట నమోదు, ఈ కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని అన్నారు.

వైఎస్సార్ సీపీ పూర్వ వైభవానికి కృషి



పార్టీ ఆశన్నగూడెం కమిటీలో పాల్గొన్న నాయకులు



పార్టీ అన్నపనేనివారిగూడెం కమిటీ

లింగపాలెం : వైఎస్సార్ సీపీకి పూర్వ వైభవం తీసుకొచ్చే క్రమంలో పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయాలని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. ఆశన్నగూడెం గ్రామంలో బుధవారం పానుగంటి రాము ఇంటి ఆవరణలో నిర్వహించిన పార్టీ గ్రామ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆశన్నగూడెం కమిటీ అధ్యక్షుడిగా బండారు వెంకటేశ్వరావు, ప్రధాన కార్యదర్శులుగా మోదుగు దుర్గారావు, మేకల వెంకటేశ్వరరావు, కుప్పాల శ్రీను, యర్రా గాబ్రేలు, కార్యదర్శులుగా పేడూరి బిక్షం, రాయల రామారావు, కట్టా రత్తయ్య, మేకల రాజేష్‌లను ఎంపిక చేశామని పార్టీ మండల అధ్యక్షులు అన్నపనేని శాంతారావు తెలిపారు.

పార్టీ అన్నపనేనివారిగూడెం అధ్యక్షుడిగా చంధరావు

వైఎస్సార్ సీపీ లింగపాలెం మండల అన్నపనేని వారిగూడెం కమిటీ అధ్యక్షుడిగా బంటు చంధరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని పార్టీ మండల అధ్యక్షులు శాంతారావు తెలిపారు. కమిటీ ప్రధాన కార్యదర్శులుగా బత్తుల ప్రభాకరావు, మోదుగు భస్కరావు, ఉప్పే మోహనరావు కార్యదర్శులుగా దొడ్డిగర్ల బాబురావు, జి.మోహనరావు, రాచప్రోలు మదు, బి.చందు, మాదాసి దానియేలు ఎన్నికయ్యారని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ దొడ్డి గర్ల రవీంద్ర, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు

జంగారెడ్డిగూడెం: ది అడ్వకేట్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ క్రీడా పోటీలు జరుగుతున్నాయి. బుధవారం న్యాయవాదులకు, పోలీసుకలు మధ్య వాలీబాల్ మ్యాచ్ జరిగింది. ఈ పోటీలో న్యాయవాదులు విజేతలుగా నిలిచారు.

‘బీసీలపై దాడులను ఖండిస్తున్నాం’



పార్థసారథి యాదవ్

జంగారెడ్డిగూడెం: బీసీలపై కూటమి శ్రేణులు దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి పార్థసారథి యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జెడ్పీటీసీ ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ కడప జిల్లా నల్లగొండవారిపల్లి గ్రామంలో ప్రచారం చేస్తుండగా పార్టీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఆర్ రమేష్ యాదవ్, రాష్ట్ర గ్రంథాలయ మాజీ చైర్మన్ రామన్నపై టీడీపీ గూండాలు, కార్యకర్తలు దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో బీసీలకు రక్షణ కరువైందని తెలిపారు. ఇటీవల కృష్ణా జిల్లా పరిషత్ చైర్మన్ బీసీ మహిళ ఉప్పాల హారిక, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుల పైనా, తాజాగా పార్థసారథి యాదవ్‌పైనా జరిగిన దాడిని బీసీలు తీవ్రంగా పరిగణించి, కూటమి గద్దె దింపే వరకు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

రమేష్ యాదవ్‌పై దాడి అమానుషం

చింతలపూడి : పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ, రాష్ట్ర బీసీ సెల్ నాయకుడు రమేష్ యాదవ్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఆపార్టీ జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు, నియోజకవర్గ బీసీ విభాగం అధ్యక్షుడు ఎం గురుబ్రహ్మాంలు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ గూండాల దాడిలో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌తో పాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు గాయపడ్డారని తెలిపారు. దోషులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నిజమైన సైకోలు చంద్రబాబు, లోకేష్



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ మండల కన్వీనర్ వాసు

ద్వారకాతిరుమల: నిజమైన సైకోలు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ అని, అందుకే రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నడుపుతున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు ఆరోపించారు. దేవరపల్లిలో మంగళవారం రాత్రి నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు ముగింపు సభలో ఎమ్మెల్యే వెంకటరాజు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు స్థానిక కాపు కల్యాణ మండప ఆవరణలో బుధవారం సాయంత్రం విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ రాజకీయ అనుభవం లేక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు. ఫ్రీ బస్ పథకంపై ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ ఇది వరకటి లాగా ఇంట్లో భర్త విసుకున్నా, కసురుకున్నా ఎవరూ పడాల్సిన పనిలేదని, హ్యాపీగా ఫ్రీ బస్ ఎక్కేసి పుట్టింటికి వెళ్లిపోతే, భర్తే వచ్చి తీసుకెళ్తారని వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం నిజం కాదా అని ప్రశ్నించారు. ఆ వ్యాఖ్యలను కప్పిపుచ్చుకోవడానికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపైనా, సాక్షి పత్రికపైనా, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియాపైనా నోటికొచ్చినట్టు మాట్లాడటం ఎమ్మెల్యేకు తగదన్నారు. కరోనా ప్రపంచ విపత్తు అని, అది జగన్ సీఎం కావడం వల్లే వచ్చిందనడం ఆయన అవివేకమని తెలిపారు. పార్టీ గోపాలపురం నియోజకవర్గ మేధావుల ఫోరం అధ్యక్షుడు పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేసిన ఒకటి రెండు పథకాలు కూడా పూర్తిస్థాయిలో ప్రజలకు అందించలేక పోయారని ఆరోపించారు. అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని వివరించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్ల పాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. సమావేశంలో పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మల్లిపూడి నాగమణి, చెలికాని బుల్లియ్య, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు దాసరి రాంబాబు, అచ్యుత ఏసుబాబు పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, పొనమాల ఉమామహేశ్వరరావు, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, రుద్ర శివాజీ, దాసరి ఏసురత్నం, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి షేక్ మస్తాన్ బాషా, దొప్పసాని రాంబాబు, రాచగర్ల కృష్ణ, అందుగుల రమేష్, కస్సే గంగరాజు తదితరులున్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

కొయ్యలగూడెం: వ్యాపారంలో గొడవలు కారణంగా ఒక వ్యక్తిని నిర్బంధించి, బంగారు వస్తువులు, నగదు చోరీ చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపారు. పిఠాపురానికి చెందిన చోడిశెట్టి వెంకట మహేష్ జంగారెడ్డిగూడెం నుంచి పిఠాపురం తన కారులో వెళుతుండగా, మండలంలోని నరసన్నపాలెం సమీపంలో శానం సందీప్, అంజిబాబు, మరో నలుగురు వ్యక్తులు కారును అడ్డగించారన్నారు. మహేష్‌ను కారునుంచి దింపి అతనిపై దాడి చేయడంతో పాటు, మహేష్‌కు చెందిన బంగారు చైన్, ఉంగరాలు, అతని వద్ద ఉన్న రూ.45 వేలు తీసుకున్నారని తెలిపారు. మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

జంగారెడ్డిగూడెం: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. పంగిడికి చెందిన ప్రగళ్లపాటి వీఎస్ఎస్ సత్యనారాయణమూర్తి గతేడాది అక్టోబర్ 17న డబ్బులు సెటిల్ మెంట్ నిమిత్తం అతని స్నేహితుడు జి.అయ్యప్పతో కలిసి జంగారెడ్డిగూడెం వచ్చాడు. అప్పటి నుంచి అతని ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో తండ్రి వెంకట సుబ్బారావు కుమారుడి ఆచూకీ కోసం స్నేహితుడు అయ్యప్పను అడగ్గా అత్తవారింటికి వెళుతున్నట్లు సత్యనారాయణమూర్తి చెప్పాడని పేర్కొన్నారు. దీంతో అదే నెల 19న సత్యనారాయణమూర్తి ఆచూకీ కోసం తండ్రి సుబ్బారావు చాగల్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అక్కడ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ కట్టారు. అప్పటినుంచి అతని గురించి గాలించిన దొరక్కపోవడంతో, సత్యనారాయణమూర్తి జంగారెడ్డిగూడెంలో అదృశ్యమయ్యాడని జీరో ఎఫ్ఐఆర్ బదిలీ చేశారని ఎస్సై జబీర్ తెలిపారు.

ఆసుపత్రి అభివృద్ధికి సహకరిద్దాం

జంగారెడ్డిగూడెం: స్థానిక 100 పడకల ఏరియా ఆసుపత్రిని అభివృద్ధి చేయడంలో ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా సహకరించాలని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు.

పేకాటపై దాడి

లింగపాలెం: లింగపాలెం మండలం కలరాయన గూడెం గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.25,050, పేక ముక్కలు 52 సీజ్ చేసి చేశామని ధర్మాజీగూడెం ఎస్సై వెంకన్న బాబు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.